




పంచలింగాల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు

నదిని తవ్వేశారు

- నిబంధనలు 'తుంగ'లో కలిపేశారు
- అక్రమ తవ్వకాలు నిజమే
- అక్రమార్కులబారిన తుంగభద్ర
- ప్రతిభ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు నోటీసులు జారీ
- మరో మూడు రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం ఫైల్
- సుప్రీంకోర్టు ఆగ్రహంతో జిల్లాలో తాత్కాలికంగా ఆగిన ఇసుక తవ్వకాలు
- పంచలింగాల వద్ద హైవే బిడ్జి కింద ఇసుక తవ్వకాలు

కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి):

తుంగభద్రను తవ్విపోస్తున్నారు. అధికారం మాటున నదిలోని ఇసుకను అడ్డంగా కాజేస్తున్నారు. నిబంధనల పట్టింపు అసలే లేదు. తాజాగా ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాలు ఉల్లంఘిస్తే తీవ్ర తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా అక్రమార్కులు తీరు మారలేదు. అధికారబలం ముందు సుప్రీం కోర్టు తీర్పు ఏపాటి అని బరితెగిస్తున్నారు. కౌతాళం మండలం మరళి, గుడికంబాలి రీచ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా 29 వేలు క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమంగా తవ్వినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రతిభ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు నోటీసులు జారీ చేశారు. అదే క్రమంలో మూడు కొత్త రీచ్‌లకు పర్యావరణ అనుమతుల (ఈసీ) కోసం నివేదిక పంపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు దృష్ట్యా ఇసుక తవ్వకాలు తాత్కాలికంగా ఆపేశారు.

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాల కోసం కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2, నందవరం మండలం నాగులదిన్నె-1 ఓపన్ రీచులు, సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీసిల్టేషన్ రీచులను (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు భూగర్భ వనరుల శాఖ గుర్తించారు. ఇసుక తవ్వకాలు, రవాణా కోసం జేపీ పవర్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల లీజు అనుమతులు ఇచ్చింది. లీజు గడువు ముగిసినా ఆ సంస్థ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగించారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) గత జూన్‌లో ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ అనుమతులు (ఈసీ)తో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. ప్రస్తుతం ప్రతిభ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఇసుక తవ్వకాలు చేస్తుంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు ఆదోని సబ్ కలెక్టరు నారాయణస్వామి నేతృత్వంతో కమిటీ ఆయా రీచ్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు వస్తావమేనని ఆ కమిటీ నిగ్గు తేల్చినట్లు తెలిసింది.



ఇసుక అక్రమ తవ్వకాలకు వాడిన ఎక్స్‌కవేటర్ సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

కొత్తగా మూడు రీచ్‌లు:

కౌతాళం మండలంలో తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాల కోసం నదిచాగి వద్ద 10 హెక్టార్లు, గుడికంబాలి వద్ద 10 హెక్టార్లు, మరళి వద్ద 5 హెక్టార్ల విస్తీర్ణంలో మూడు కొత్త ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు పర్యావరణ అనుమతులు (ఈసీ) కోసం నివేదిక పంపినట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. ఆ గ్రామాల్లో పబ్లిక్ హియరింగ్ (ప్రజాభిప్రాయ సేకరణ) నిర్వహించాల్సి ఉందని వివరించారు. అయితే.. ఇప్పటి వరకు ఆయా రీచ్‌లు 5 హెక్టార్ల విస్తీర్ణానికి మించి లేవు. అనుమతి విస్తీర్ణం దాటి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. దీన్ని నిరోధించాల్సిన అధికారులు రీచ్‌ల విస్తీర్ణం పెంచి ఈసీ అనుమతుల కోసం పంపడం విమర్శలకు తావిస్తోంది.

అక్రమ తవ్వకాలు నిజమే

ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి, గనులు భూగర్భ వనరులు శాఖ (మైనింగ్) డీడీ రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ, కౌతాళం మండలం తహసీల్దారు సహా సర్వే, రెవిన్యూ సిబ్బంది బృందం కౌతాళం మండలం గుడికంబాలి-3, మరళి-1,2 రీచ్‌లను ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. తుంగభద్ర నదిలో అనుమతి ఇచ్చిన రీచ్‌ల విస్తీర్ణం దాటి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తవ్వకాలు చేశారని గుర్తించారు. 29 వేల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక అక్రమంగా తవ్వినట్లు నిర్ధారించారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా లీజ్ సంస్థ అయినా ప్రతిభ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు మైనింగ్ అధికారులు పేర్కొన్నారు. అయితే.. అధికారులు నిర్ధారించిన పరిమాణం కంటే రెండింతలు ఎక్కువగానే అక్రమంగా తవ్వేసినట్లు తెలుస్తోంది. నోటీసులు జారీ చేసి నెలలు గడుస్తున్నా.. లీజు సంస్థ నుంచి ఎలాంటి సమాధానం లేదని తెలుస్తున్నది.

తాత్కాలికంగా ఆగిన తవ్వకాలు

ఎన్జీటీ తీర్పుకు విరుద్ధంగా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, పలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేసినట్లు ప్రభుత్వ అధికారుల విచారణలో వెల్లడి అయ్యిందని సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. ఉల్లంఘనలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. కౌతాళం, సి. బెళగల్ మండలాల్లో తుంగభద్ర రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు, రవాణాను తాత్కాలికంగా ఆపేశారు. ఇది ఎన్నాళ్లు కొనసాగుతుందో..? అంటూ స్థానికులు పేర్కొంటున్నారు. అయితే.. రాజకీయ నాయకుల అండతో కౌతాళం మండలంలో రీచ్‌లకు దూరంగా అక్రమంగా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



కౌతాళం మండలం మరళి-2 ఇసుక రీచ్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

నేషనల్ హైవే బిడ్జి కింద ఇసుక తవ్వకాలు

కర్నూలు నగర శివారులో తుంగభద్ర నదిలో మునగాలపాడు, పంచలింగాల తదితర గ్రామాలకు చెందిన పలువురు ఇసుక తవ్వకాలు చేస్తూ ఎడ్లబండ, ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తున్నారు. గ్రామం చెంతనే ఉన్న తంగభద్ర ఇసుక ఆధారంగా పలువురు జీవనం జీవనం సాగిస్తున్నారు. వారి వల్ల పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదని, దీంతో చూసి చూడనట్లు వెళ్తున్నామని అధికారులు అంటున్నారు. అయితే.. హైదరాబాదు-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-44 తుంగభద్ర నది దాటేందుకు హైవే బిడ్జి నిర్మించారు. ఈ బిడ్జికి ఇరువైపు దాదాపు వంద మీటర్ల వరకు ఎలాంటి ఇసుక తవ్వకాలు చేయరాదని నేషనల్ హైవే అథారిటీ నిపుణులు పేర్కొంటున్నారు. ఇందుకు విరుద్ధంగా బడ్జి దిగువన, పిల్లర్లకు అతి సమీపంలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల యజమానులు ఇసుక తవ్వకాలు చేస్తుండడం వల్ల బిడ్జికి ప్రమాదకరమని అంటున్నారు.



నేషనల్ హైవే బిడ్జి పక్కనే ఇసుక తవ్వకాలు

ఇసుక తవ్వకాలు ఆపేశాం

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు నేపథ్యంలో తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు తాత్కాలికంగా ఆపేశాం. తదుపరి ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు మేరకు ముందుకు వెళ్తాం. కౌతాళం మండలంలో రీచ్‌ల విస్తీర్ణం దాటి 29 వేల క్యూబిక్ మీటర్లు ఇసుక అక్రమంగా తవ్వినట్లు గుర్తించి లీజు సంస్థ ప్రతిభ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు నోటీసులు జారీ చేశాం. నేషనల్ హైవే బిడ్జి దిగువన, అతి సమీపంలో ఇసుక తవ్వకాలు చేయరాదు. స్థానిక గ్రామస్థులలో అవగాహన కల్పిస్తాం. అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, డీడీ, మైనింగ్ శాఖ, కర్నూలు

జోరుగా వజ్రాల అన్వేషణ



జొన్నగిరిలో వజ్రాలు అన్వేషిస్తున్న దృశ్యం

తుగ్గలి, మే 17: తొలకరి జల్లులు కురిస్తే నేల చల్లబడుతుంది. పశ్చిమ కర్నూలు జిల్లాలో అయితే వజ్రాలు దొరుకుతాయి. ఆ వజ్రాల కోసం ఇతర ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చి పంట పొలాల్లో అన్వేషిస్తారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి తదితర గ్రామాల్లోని పొలాల్లో వజ్రాల అన్వేషణ కోసం సుదూర ప్రాంతాల నుంచి చేరుకున్నారు. ఒక్క వజ్రం దొరికితే.. తలరాతలు మారుతాయన్న ఆశతో గుంటూరు, నంద్యాల, అనంతపురం, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాలు, బస్టాండు తదితర ప్రాంతాల్లో వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వజ్రాల కోసం పెద్ద ఎత్తున వచ్చి పొలాల్లో తిరగడం వల్ల పొలాలు గట్టిబడి పంటలు సక్రమంగా పండటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల్లోకి రాకూడదని కాపలా ఉంటున్నారు. కొంత మంది వజ్రాల అన్వేషణ కోసం వస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు కూడా పెట్టారు.

భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి




ఆర్‌యూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(కలెక్టరేట్), మే 17: రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల వద్ద ఉండే భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూముల లైవ్ ఫీడ్, ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన ఇంజనీరింగ్, లైఫ్ సైన్స్ బ్లాక్‌లను జిల్లా ఎస్పీ.జి.కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు నిరంతరం సక్రమంగా పని చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ బ్లాక్ కుడి వైపు ఉన్న సర్కిల్ వద్ద ఉన్న కొండ ప్రాంతం కింద కూడా బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పోలైన ఓట్లపై టీడీపీ ఆరా..?

- బూత్‌ల వారీగా ఓట్ల సేకరణలో బిజీ
- నియోజకవర్గాల వారీగా 17ఏ సేకరణ



కర్నూలు(అర్బన్), మే 17: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు పోలైన ఓట్లను ఆరా తీసేపనిలో పడింది. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతి నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ రోజు ఆర్‌వోలు జారీ చేసిన ఫారం17ఏలను సేకరించే పనిలో పడింది. జిల్లాలోని 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలోని బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు ఉన్నాయి.. ఎంత మంది పోలింగ్‌లో పాల్గొని ఓటు వేశారనే లెక్కలను ఆరాతీస్తోంది. ఈ క్రమంలో పోలైన ఓట్లను బట్టి ఫలానా అభ్యర్థికి ఇన్ని ఓట్లు వచ్చాయనే దానిపై స్పష్టత రానుందని అంచనాలు వేసుకుంటున్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు ప్రత్యేకంగా పోలైన ఓట్లను బేరీజు వేసుకుంటూ ఎంత మంది అభ్యర్థులు విజయానికి చేరువలో ఉన్నారనే ముందస్తు కరసత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించి ఎన్ని ఓట్లు పోలయ్యాయన్న దానిపై కింది స్థాయి నాయకత్వం ఇప్పటికే ఆయా అభ్యర్థుల వద్ద లెక్కలు వేస్తోంది. నియోజకవర్గాల వారీగా పక్కగా 17ఏ ద్వారా పోలైన ఓట్లు తెలిస్తే మరింత స్పష్టత రానుందని టీడీపీ వర్గాలద్వారా సమాచారం. ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి నియోజకవర్గాల నుంచి సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి అందజేస్తున్నారు. ఆయన టీడీపీ కార్యాలయంలో ఉంటూ కర్నూలు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలపై రోజువారీ సమీక్షలు జరుపుతున్నారు.

కర్నూలులో జడి వాన

- పగలు ఎండ, రాత్రి వర్షం
- పొలం పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు



కర్నూలు నగరంలో కురుస్తున్న వాన

కర్నూలు(అగ్రికల్చర్), మే 17: ఎండ వేడిమితో గత నెల రోజులుగా అల్లాడిపోయిన ప్రజలకు గత వారం రోజుల నుంచి కాస్త ఊరట లభించింది. శుక్రవారం సాయంత్రం కర్నూలు నగరంలో జడివాన కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు కొంత మంది ఇబ్బందులు పడ్డారు. కాగా కర్నూలు జిల్లాలో మంత్రాలయంలో 49.6 ఎంఎం,





నందవరంలో 42.6ఎంఎం, కౌతాళంలో 42, హొళగుందలో 31.2, ఆదోనిలో 26.4, గోనెగండ్లలో 25.4, ఎమ్మిగనూరులో 24.2, కోసిగిలో 22.8, డి. బెళగల్ మండలంలో 20.4, పెద్దకడుబూరులో 10.2, ఆస్పరిలో 9.4 ఎంఎం వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో చెదురుమొదురు వానలు నమోదయ్యాయి. కర్నూలు, కల్లూరు మండలాల్లో 30.25 ఎంఎం వర్షం నమోదైంది. కాగా జిల్లాలో వర్షం రాకకోసం ఎదురు చూస్తున్న రైతులు గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికార వర్గాలు తెలపడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లలోని కొన్ని మండలాల్లో మే 19న పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ ప్రమాదం పొంచి ఉందని వారు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మే 21న పిడుగులతో కూడిన వర్షం నమోదవుతుందని వారు తెలిపారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లో పని చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు గొర్రెల కాపరులు చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. శుక్రవారం నంద్యాల జిల్లాలోని బేతంచెర్లలో 73.5 ఎంఎం వర్షం నమోదైంది.



గుత్తి పెట్రోల్‌బంకు వద్ద..

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.6

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లి				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసే వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితీ, కల్లూరు (మం.), కర్నూలు -518002.

కర్నూలు(అగ్రికల్చర్), మే 17:

గత ఎన్నికలైనప్పటి నుంచి వైఎస్ జగన్ ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న వాటిలో రైతు భరోసా కేంద్రాలు ఒకటి. ఐదేళ్లు పూర్తయ్యాయి. ఆర్బీకేల పట్ల ఆయన చిత్తశుద్ధి జిల్లాలో తేటతెల్లమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 877 రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేవలం 50 నుంచి 60 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని అద్దె భవనాల్లోనో, వేరే కార్యాలయాల్లోనో నిర్వహిస్తున్నారు. ఈ భవనాలకు నెలనెలా అద్దె చెల్లించడం లేదు. ఆ భవనాల యజమానులు అద్దె కడతారా.. తాళం వేయమంటారా అంటున్నారు. వారికి సిబ్బంది సమాధానం చెప్పుకోలేక క్యాంపుల పేరుతో బయటే తిరుగుతున్నారు. కూర్చోవడానికే స్థలం లేని ఈ కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, రైతులకు ఉపయోగపడే సామగ్రిని ఎక్కడ ఉంచుకోవాలో తెలియక సిబ్బంది ఇబ్బందిపడ్డారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఆర్‌బీకే కేంద్రాల వల్ల రైతులకు కనీస ప్రయోజనం కలగలేదనే విమర్శలు ఉన్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనాన్ని ఆర్‌బీకే కేంద్రం నిర్వహించడానికి నిర్మిస్తున్నారు. గూడూరు మండలం నాగులాపురం గ్రామంలో ముళ్లకంపల మధ్య అసంపూర్తిగా ఇది ఉండిపోయింది. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ గ్రామంలో ఆర్‌బీకే కేంద్రాన్ని ఒక షెడ్డులో నిర్వహిస్తున్నారు. అందులో ఇద్దరు సిబ్బంది కూడా కూర్చోవడానికి స్థలం లేదు.

- సొంత భవనాలు లేవు.. ప్రైవేట్ భవనాలకు అద్దె చెల్లింపు లేదు
- సిబ్బంది కూచోడానికే చోటు లేదు
- ఇక ఎరువులు, విత్తనాలకు చోటెక్కడ?
- జగన్ ఆర్భాటమేగాని.. ప్రయోజనం శూన్యం

ఇదీ ఆర్బీకేల గతి

నిర్మాణాలు నత్తనడకనే

వైసీపీ ప్రభుత్వం 2020, మే 1న రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించింది. జిల్లాలో 877 రైతుబరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 403 రైతుభరోసా కేంద్రాలను గ్రామ పంచాయతీలు, మండల వ్యవసాయ కార్యాలయాల్లో సర్దుబాటు చేశారు. మరో 474 ఆర్‌బీకేలను అద్దె బిల్డింగుల్లో నిర్వహిస్తున్నారు. రైతుభరోసా కేంద్రాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. 845 రైతుభరోసా కేంద్రాలకు అవసరమైన భవనాలను రూ.184.77 కోట్లతో నిర్మించాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్‌శాఖకు నిర్మాణ బాధ్యతను అప్పగించారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. పూర్తయిన భవనాలకు బిల్లులు ఇవ్వలేదు. ఆర్బీకే కేంద్రాల భవన నిర్మాణాలకు 90 శాతం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను కేంద్రం సమకూరుస్తుంది. మరో 10 శాతం నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. ఆ డబ్బు కూడా ఇవ్వలేదు. దీంతో రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణం జిల్లాలో నత్తనడకన సాగుతోంది.

ఆర్‌బీకేలకు రాని బ్యాంకు కరస్పాండెంట్లు.. చెడిపోయిన కియోస్కో మిషన్లు

బ్యాంకులు లేని గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు బ్యాంకింగ్ సేవలు అందించడానికి సమీపంలో ఉన్న బ్యాంకు కరస్పాండెంట్లను ఆర్‌బీకేలకు అనుసంధానించి మ్యాపింగ్ చేశారు. అయితే.. చాలా మంది బ్యాంకు కరస్పాండెంట్లు ఆర్‌బీకేలకు రావడం లేదు. రైతులకు అందించే సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ఆర్‌బీకేలలో కియోస్క్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కియోస్క్ కొనుగోలుకు ప్రభుత్వం రూ.80వేల దాకా ఖర్చు పెట్టింది. అయితే.. వీటి నిర్వహణ చాలా చోట్ల సక్రమంగా లేదు. . కొన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో కియోస్క్‌లు చెడిపోవడంతో వాటిని మూలకు పడేశారు.



ప్రైవేటు షాపుల్లోనే ఎరువులు, విత్తనాలు కొన్నా



నేను పదెకరాల పొలం గుత్తకు తీసుకుని పత్తి పంటను సాగు చేస్తున్నాను. రైతుభరోసా కేంద్రంలో విత్తనాలు ఇవ్వలేదు. బైట దుకాణంలో విత్తనాలు, ఎరువులు కొన్నా.

- శంకర్ సల్కాపురం, రైతు

ఆర్‌బీకేల ద్వారా అన్ని ప్రయోజనాలు



ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు అన్ని ప్రయోజనాలు తీరుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. అవి తాత్కాలికమే. ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. ఆర్బీకేల సొంత భవనాల నిర్మాణం దాదాపు పూర్తవుతోంది. - వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఏడు నెలలుగా అద్దెల్లేవ్

- తాళం వేస్తామంటున్న యజమానులు:

అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న 474 రైతుభరోసా కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేవు. వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులు కూర్చోవడానికి కుర్చీలు లేవు. ఆర్‌బీకేకు సంబంధించిన పరికరాలను ఉంచుకోడానికి స్థలం లేదు. డిసెంబరు నెల నుంచి అద్దె చెల్లించకపోవడంతో బిల్డింగుల యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో బిల్డింగులు ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలని, వెంటనే అద్దె బకాయిలు చెల్లించాలని సిబ్బంది ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వగానే అద్దె బకాయిలు చెల్లిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల యజమానులు తమ భవనాలను ఖాళీ చేయకపోతే తాళం వేసుకుంటామని అంటున్నారు. కల్లూరు మండలం నాగులాపురం గ్రామంలో ఆర్బీకేను నిర్వహిస్తున్న భవనం యజమాని ఒత్తిడి తట్టుకోలేక సిబ్బంది సమీపంలోని సచివాలయంలో తాత్కాలిక వసతి కోసం ఎదురు చూస్తున్నారు. సచివాలయంలో ఎట్లా వసతి కల్పిస్తామని అక్కడి సిబ్బంది అంటున్నారు. అందులో దాదాపు పది మంది సిబ్బంది పని చేస్తున్నారు.

ఎరువులు, విత్తనాలు ఎక్కడ?

సిబ్బంది కూచోడానికే వసతి లేని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించేందుకు ఏ మాత్రం అవకాశం ఉండడం లేదు. గత సంవత్సరం ఖరీఫ్‌లో జిల్లాలో రైతులకు 3.04 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించారు. ఈ విక్రయాల్లో కేవలం 813 రైతుభరోసా కేంద్రాల ద్వారా అత్యల్పంగా 33,548 మెట్రిక్ టన్నుల ఎరువులను మాత్రమే రైతులకు అందించగలిగారు. ఆ ఎరువుల్లో కూడా రైతులకు ముఖ్యమైన డీఏపీ, పొటాష్, యూరియా తదితర ఎరువులు అందించలేదు. విత్తనాలు ఇవ్వడం లేదు. దీంతో రైతులు కర్నూలు నగరంలోని డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులను కొనాల్సి వస్తోంది. డీటర్లు ఒక బస్తా ఎరువుపై రూ.50-100 అధికంగా వసూలుచేస్తున్నారు.

కేంద్రం అభ్యంతరంతో వైఎస్సార్ రైతుభరోసా పేరు మార్పు

రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలను ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా కేంద్రం 90 శాతం ఇస్తోంది. మిగతా 10 శాతం నిధులు ఇచ్చే రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనాలకు వైఎస్సార్ రైతుభరోసా కేంద్రమని పేరు పెట్టడంపై బీజేపీ నాయకులు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో రైతు ఉత్పత్తుల వనరుల కేంద్రంగా పేరుపెట్టాలని కేంద్రం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

ముగిసిన అగ్రికల్చర్, బీ-ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు

నేటి నుంచి ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 17: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ-ఫార్మసీ ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్టు-2024 సంబంధించి అగ్రికల్చర్, బీ-ఫార్మసీ ప్రవేశ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఎంట్రెన్స్ టెస్టుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,248 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 16వ తేదీన 3,678 మందికి గానూ 3,419 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. శుక్రవారం 3,573 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష జరుగుతుంది. కర్నూలు జిల్లాలో మొత్తం అభ్యర్థులు 12,249 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలులో 6, ఆదోని, ఎమ్మిగనూరులో ఒక్కొక్కటి చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు పరీక్ష నిర్వాహకులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

సీపెట్ డిప్లమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 17: విజయవాడలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) మూడు సంవత్సరాల వ్యవధి కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి మే 24 చివరి గడువు అని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 9వ తేదీన సీపెట్ అడ్మిషన్స్ టెస్టు (క్యాట్) జరుగుతుందన్నారు. ఎంట్రన్స్ టెస్టులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ) డిప్లమో ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లోనూ బీఎస్సీ విద్యార్హతతో రెండు సంవత్సరాల వ్యవధిగల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసిసింగ్ అండ్ టెస్టింగ్ మూడు సంవత్సరాల కోర్సుల ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 6300147965 నెంబరును సంప్రదించాలన్నారు.

కౌంటింగ్‌కు సచివాలయ సిబ్బంది దూరం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), మే 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల కౌంటింగ్‌కు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవడం లేదని కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ విధులకు ప్రభుత్వ ఉద్యోగులు తగినంత మంది ఉన్నారన్నారు. అందుకే అదనంగా సచివాలయ సిబ్బంది కౌంటింగ్ విధులకు అవసరం లేదని కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

15 వేల క్వింటాళ్ల రాయితీ విత్తనాలు

- ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోండి
- రైతులకు జేడీ విజ్ఞప్తి

కర్నూలు(అగ్రికల్చర్), మే 17: కర్నూలు జిల్లాలో రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రాయితీపై ప్రధాన పంటకు సంబంధించిన వేరుశనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వేరుశనగ విత్తనాలు 5,700 క్వింటాళ్లు, జీలుగ 4,400 క్వింటాళ్లు, పిల్లిపెసర 6,700 క్వింటాళ్లను రైతులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వేరుశనగ విత్తనాలకు సంబంధించి క్వింటా విత్తనాల పూర్తి ధర రూ.9,500లు కాగా, 40 శాతం రాయితీ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో రైతుల వాటా 3,800 చెల్లించాలని తెలిపారు. అదేవిధంగా జీలుగ క్వింటా రూ.8,800లు పూర్తి ధర కాగా, రాయితీ రూ.4,400 ఉండగా రైతులు రూ.4,400లు చెల్లించాలన్నారు. అదేవిధంగా పిల్లిపెసర క్వింటా ధర రూ.13,400లు కాగా, 6,700లు రాయితీని ప్రభుత్వం ఇస్తుందని, రైతులు రూ.6,700 భరించాలని సూచించారు. రాయితీ విత్తనాలు కావాలనుకునే రైతులు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. త్వరలోనే రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని జేడీ వరలక్ష్మి తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేయండి

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అర్బన్), మే 17: ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-4599కు వినియోగించుకోవాలని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫ్రీనెంబర్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడ తవ్వకా లు జరిపినా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు ఈ మెయిల్ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

రామతీర్థంలో అతిసార

నలుగురికి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

బనగానపల్లె రూరల్, మే 17 : మండలంలోని రామతీర్థం గ్రామంలో దాదాపు 30కి మంది పైగా అతిసార బారిన పడ్డారు. మూడు రోజులుగా గ్రామానికి చెందిన పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ నంద్యాల, బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పారిశుధ్యం లోపించడం, తాగునీరు కలుషితం కావడం వల్ల గ్రామంలో అతిసార ప్రబలినట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజులుగా అతిసార బారిన పడివారిలో 10 మంది పూర్తిగా కోలుకున్నారు. మరి కొంత మంది బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో నలుగురు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చిక్సిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన జీవరత్నం భార్య విజయమ్మ రెండు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో బాధపడుతూ బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అయితే ఆమె ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందిందని, అతిసార వల్ల కాదని పలుకూరు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. బనగానపల్లె మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ గ్రామానికి చేరుకుని అతిసార ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. పలుకూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధుమౌనిక, డాక్టర్ చాణిక్యనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి అతిసార బారిన పడ్డావారికి వైద్య చికిత్సలు అందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ మాట్లాడుతూ ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి గ్రామానికి తాగునీటి సరఫరాను నిలిపివేసి, శాంపిళ్లను పరీక్షల నిమిత్తం పంపామన్నారు. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా 5 ట్యాంకర్లతో తాగునీటిని సప్లయ్ చేస్తున్నామని తెలిపారు.



చికిత్స పొందుతున్న గ్రామస్తులు

పిచ్చి కుక్క వీరంగం

ఐదుగురికి గాయాలు



కర్నూలు(హాస్పిటల్), మే 17: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. ఐదుగురిపై దాడి చేసింది. ఇందులో నలుగురికి గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా దొర్నాలకు చెందిన మూడేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం ఆసుపత్రిలోని గైనిక్ విభాగం వద్ద ఓ సెక్యూరిటీ గార్డును గాయపరిచిన పిచ్చి కుక్క ఆ తర్వాత హౌస్ సర్జన్ క్వార్టర్స్ వద్ద ఓ డాక్టర్‌ను కరిచింది. ఆ తర్వాత క్యాన్సర్ విభాగం వద్ద ఓ రోగి సహాయకురాలిపై బూత్ బంగ్లాలో ఇద్దరిపై దాడి చేసింది. ప్రకాశం జిల్లా దోర్నాలకు చెందిన నాగలక్ష్మి అనే చిన్నారిపై దాడి చేసి ముఖాన్ని తీవ్రంగా గాయపరిచింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి ఆదేశాల మేరకు సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు చిన్నారికి క్యాజువాలిటీకి తరలించి ఐడీ వార్డులో ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజెక్షన్ వేయించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా. మంజులబాయి నేతృత్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సింధూ ప్రియాంక ఆపరేషన్ చేశారు. ఆసుపత్రిలో ముఖద్వారాలు వద్ద కుక్కల బెడద తీవ్రంగా ఉంది. సెక్యూరిటీ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.





కుక్క దాడిలో గాయపడిన వ్యక్తులు

ఇన్సూరెన్స్ కంపెనీలకు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు(లీగల్), మే 17: బీమా మొత్తం చెల్లించకుండా ఫిర్యాదుదారులకు సేవాలోపం చేసిన రెండు ఇన్సూరెన్స్ కంపెనీలకు తగిన రీతిలో వడ్డిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆదోనికి చెందిన సభాకౌసర్ పవర్‌లూమ్‌ను 2019లో బ్యాంకులోన్ తీసుకుని ఏర్పాటు చేసుకున్నారు. ఆ పవర్ లూమ్‌కు కోలా మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో 2019లో ఇన్సూరెన్సు చేయించారు. ఆ తర్వాత 2020 అక్టోబరు 30న కురిసిన భారీ వర్షాలతో వర్షం నీరు పవర్‌లూమ్ సంస్థలోనికి భారీగా చేరి షాట్‌సర్క్యూట్‌తో పవర్ లూమ్ మిషన్లు కాలిపోయాయి. మిషన్లకు ఇన్సూరెన్స్ చేయించి ఉండటంతో ఫిర్యాదిదారు సభాకౌసర్ బీమా మొత్తం కోసం కోలా మండలం ఇన్సూరెన్స్ కంపెనీకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఇన్సూరెన్స్ కంపెనీ ఫిర్యాదీకి రూ.1.75 లక్షలు మాత్రమే నష్టం జరిగిందని, అంతేగాక ఆ నష్టానికి షాట్ సర్క్యూట్ కారణం కాదని తెలియజేసింది. దీంతోసభాకౌసర్ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసును విచారించిన కమిషన్ ఫిర్యాదికి ఇన్సూరెన్స్ మొత్తం చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఫిర్యాదికి జరిగిన నష్టం రూ7.50 లక్షలను 9 శాతం వడ్డీతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.60వేలు సభాకౌసర్‌కు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ కోలమండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఆదేశించింది. మరొక కేసులో కర్నూలు జిల్లా గూడూరు మండలానికి చెందిన ఓం ప్రకాష్ 2021లో రూ.25 లక్షలకు బీమా పాలసీ చేసుకున్నాడు. అయితే.. అదే ఏడాది అక్టోబరు 4న ఓం ప్రకాష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు బీమా పాలసీ నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాన్ని నడిపారని, బీమా మొత్తం చెల్లించడానికి ఇన్సూరెన్స్ కంపెనీ నిరాకరించింది. అయితే. కేసును విచారించిన వినియోగదారుల కమిషన్ రోడ్డు ప్రమాదం నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాన్ని నడపడం వల్ల జరగలేదని నిర్ధారించింది. దీంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ వినియోగదారుల కమిషన్ ఆదిత్య బిర్లా ఇన్సూరెన్స్‌కు ఆదేశించింది.

ఇసుక తవ్వకాల కోసం ఈసీకి లేఖ

కర్నూలు(అర్బన్), మే 17: జిల్లాలో మూడు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతుల కోసం ఈసీకి లేఖ రాశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని గుడికంబాలి, న దిచాగి, మర్లి గ్రామాల పరిధిలోని తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌లను విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడుతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర పర్యావరణ ప్రభావ మదింపు అధికారి కార్యాలయం పరిశీలించి ఈ మూడు రీచ్‌ల్లో 25 హెక్టార్ల ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

కర్నూలు(అర్బన్), మే 17: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నగరంలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నగర శివారులోని బృందావన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం డిగ్రీ 2,4,6 సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఆర్‌సీరెడ్డి, శ్రీసాయిక్రిష్ణ డిగ్రీ కళాశాలల్లో పరీక్షల తీరును పరిశీలించారు.

యువకుడు ఆత్మహత్య

ఆళ్లగడ్డ, మే 17: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన నాగరాజు(25) యువకుడు శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు గత కొంత కాలం పట్టణంలోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కొంతమందికి అప్పులిప్పించాడు. వారు తిరిగి ఇవ్వక పోవడంతో ఇచ్చిన వారి వత్తిడి తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగు ఫ్యానుకు చీరతో ఉరి వేసుకున్నాడు. దీనిపై పట్టణ పోలీసులు మాట్లాడుతూ రిజిస్ట్రారు కార్యాలయంలో రైటర్‌గా నాగరాజు ఉద్యోగం మానుకున్నాడని, మానసిక స్థితి బాగా లేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. చెప్పారు. మృతుడి తండ్రి రఘురామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

పెద్దకడుబూరు, మే 17: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిన్న తుంబలం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి రామాంజి, లక్ష్మి దంపతుల కుమారుడు శివ (11) ఇంటి పక్కన ఉన్న పాడుబడ్డ గుడిసెలో కుక్క పిల్లలను పట్టుకోడానికి స్నేహితులతో వెళ్లాడు. అక్కడ తెగి వేలాడుతున్న విద్యుత్ తీగను గమనించకుండా శివ తొక్కి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీన్ని గమనించిన చిన్నారులు శివ కుటుంబసభ్యులకు విషయం తెలిపారు. వారు సంఘటన స్థలానికి చేరుకునేలోగా, అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఎదుగుతున్న కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

వైసీపీనేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఎర్రబోతుల ఉదయభాస్కర్‌రెడ్డితో పాటు 30 మందిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, మే 17 : కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట గ్రామంలో ఎన్నికల సందర్భంగా మే 13న పోలింగ్ రోజున చోటు చేసుకున్న గొడవకు సంబంధించి ఎట్టకేలకు వైసీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పోలీసులు శుక్రవారం నమోదు చేసినట్లు . సీఐ గోపీనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోదరుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయభాస్కర్‌రెడ్డిలతో పాటు ఎంపీటీసీ సోమశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితర 30 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు.

చంద్రబాబును కలిసిన టీజీ భరత్


చంద్రబాబుకు పూల బొకే అందజేస్తున్న టీజీ భరత్

కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్ర బాబును కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ శుక్రవారం కలిశారు. షిర్డీసాయిబాబా దర్శనం అనంతరం హైదరాబాదుకు చేరుకున్న చంద్రబాబును ఆయన స్వగృహంలో టీజీ భరత్ కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్, ఓటర్ల సరళి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. జూన్ 4 తరువాత టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని టీజీ భరత్‌తో చంద్రబాబు పేర్కొనట్లు తెలిసింది.

వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), మే 17: స్థానిక వేదాస్ షెల్టర్ హోం, వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను అక్కడ ఉంటున్న వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవా ధికార సంస్థను ఆశ్రయించాలని ఆయన అక్కడ ఉంటున్నవారిని కోరారు.

న్యాయవాదులకు లోన్ మేళా

కర్నూలు(లీగల్), మే 17: బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు లోన్ మేళాను నిర్వహించారు. న్యాయవాదులకు అవసరమైన పర్సనల్ లోన్లను ఎటువంటి ఇబ్బందులు లేకుండా లోన్‌ను మంజూరు చేస్తామని ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు న్యాయవాదులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, బజాజ్ ఫైనాన్స్ మేనేజర్ ప్రదీప్‌గౌడు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మే 17: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కర్నూలు డివిజన్ ఈఈ వెంక టేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 రాజేంద్ర బాబు తెలిపారు. బాబా బృందావన్‌నగర్, రాజీవ్‌నగర్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, జోహరాపురం రోడ్ మిల్క్ డెయిరీ ఏరియా తదితర ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందని తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

కర్నూలు(అర్బన్), మే 17: నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ పర్యవే క్షణలో ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండ, గెడేంబాయి తండా ప్రాంతాల్లో నాటు సారాకు తయారీగా ఉంచిన 3,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, ఎస్ఐ రెహనా, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి

కర్నూలు(న్యూసిటీ), మే 17: నగరంలోని పలు ప్రాంతాలలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బళ్లారి చౌరస్తా సమీప కాలనీల అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి చౌరస్తా ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ పన్నులు పెంచడంపై ఉన్న శ్రద్ధ పారిశుధ్యం మెరుగుపరచడంపై చూపించాలని అన్నారు. బళ్లారి చౌరస్తాలో రోడ్డుపై మురుగు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు వాంతులు చేసుకుంటు న్నారని అన్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపు కుంటున్నారని విమర్శించారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు, కాల్వలు చిన్నపాటి చెరువుల్లాగా తయారై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.పీటర్, సీవీ.వర్మ, అసోసి యేషన్ ప్రతినిధులు కే.గోపీనాథ్, ఎస్.పరమేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో బీఎస్ఎన్ఎల్ కీలకపాత్ర

కర్నూలు(న్యూసిటీ), మే 17: సమాజ అభివృద్ధిలో బీఎస్ఎన్ఎల్ కీలక పాత్ర పోషిస్తుందని బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ అన్నారు. శుక్రవారం ప్రకాష్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ప్రపంచ టెలికమ్యూ నికేషన్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ పట్టణ ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలకు సర్వీలసును విస్తరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రాజేశ్వరరావు, ఏజీఎం సేల్స్ అండ్ మార్కెటింగ్ బి.వెంటరాములు, ఏజీఎం అర్బన్ వి.శ్రీనునాయక్, ఏజీఎం ఆపరేషన్ పి.శ్రీని వాసరావు పాల్గొన్నారు.

రేపు భగవద్గీత పారాయణం

కర్నూలు(కల్చరల్), మే 17: కర్నూలు గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డీవీ రమణ, అనంత అనిల్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్‌లో హరిహర క్షేత్రం పక్కన గల గీతా ప్రచార ధామంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. నగరంలోని భగవద్గీత ప్రచారకులు, ధార్మిక చింతనాపరులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్, మే 17: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. పంచాయతీలలో వీధి దీపాలు వేయడానికి కూడా అప్పులు తెచ్చి వేయాల్సిన పరిస్థితి దాపురించిదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటంతో అధికారులు ఎవ్వరు నోరుమె దప లేదు. మండలంలో ని ప్రతి పంచాయతీలో తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమౌతున్నా మండల స్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన రహదారులపై మురుగు

» కల్లూరు అర్బన్‌లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
» చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయం


రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన మురుగు

కల్లూరు, మే 17: కల్లూరు అర్బన్ 16 వార్డుల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే ప్రధాన రోడ్లు మురుగునీటితో ప్రవహిస్తూ చెరువులను తలపిస్తున్నాయి. సమీప కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతోంది. నగరపాలకసంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిందంటే సమీప కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు, వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నెలల తరబడి డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించకపోవడంతో వర్షం పడగానే మురుగు రోడ్లపైకి చేరి ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. 26వ వార్డు బిర్లాగేట్ నుండి కొట్లా రైల్వేస్టేషన్ అండర్ గ్రౌండ్ రైల్వేబ్రిడ్జి కింద మోకాలి లోతుకు పైగా నీరు నిల్వ చేరడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. కల్లూరు అర్బన్ వార్డుల్లో డ్రైనేజీలు లేకపోవడంతో పలు కాలనీల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● **ఆదాయం ఉన్నా..** కర్నూలు నగరపాలక సంస్థలో వీలీనమైన కల్లూరు అర్బన్ 16 వార్డులు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ. కోట్లల్లో ఆదాయం సమకూరుతున్నా ప్రజలకు మౌలిక వసతులు సమకూర్చడంలో పాలకులు, అధికారులు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు ఇవ్వలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

అధిక రక్తపోటు ఆరోగ్యానికి చేటు





శ్రీరామ్‌నగర్‌లో అవగాహన సదస్సులో పాల్గొన్న కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యులు, మాట్లాడుతున్న మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టులు

కర్నూలు(హాస్పిటల్), మే 17: అధిక రక్తపోటు ఆరోగ్యానికి చేటు అని కర్నూలు మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టులు డా.ఎస్.చైతన్య కుమార్, డా.బీఎస్ ప్రవీణ్ కుమార్, డా.సీఎస్ తేజానందరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మెడికవర్ హాస్పిటల్‌లో వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దీర్ఘకాలిక సమస్యలు బాగా ఎక్కువైపోతున్నాయని, వాటిలో బీపీ ఒకటని, బీపీ అనేది ఒకసారి వచ్చిందంటే జీవితంలో మళ్లీ తగ్గదని హెచ్చరించారు. బీపీతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని, ఎంతో మంది హార్ట్‌ఎటాక్ వల్ల చనిపోతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నియామాలతో తగ్గించవచ్చు నన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

35 ఏళ్లు దాటితే.. బీపీని పరీక్షించుకోండి: 35 ఏళ్లు దాటిన వారు 6 నెలలకు ఒకసారి బీపీ పరీక్షలు చేయించుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీరామ్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటరులో రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని, అశ్రద్ధ చేయరాదన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైష్ణవి, నాగరాజు మాట్లాడుతూ ఆహార పదార్థాల్లో ఉప్పు తక్కువగా ఉపయో గించాలని, బీపీకి క్రమం తప్పకుండా మందులు వాడాలని అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి నాయక్, సీనియర్ రెసిడెంట్ ఆలి, మెడికల్ ఆఫీసర్ దివ్య, అధ్యాపకులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే బీపీ: మానసిక ఒత్తిడితోనే అధిక రక్తపోటు వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా డీఎంహెచ్‌వో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, తరుచూ రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు కోఆర్డినేటర్ హేమలత, డీపీఎంవో ఉమా, డెమో ప్రమీలా దేవి, డీపీహెచ్ఎన్‌వో ఇందిర, ఎస్‌వో హేమ సుందరం, డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా మండలంలోని హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ జే.రేఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని, ఉప్పు , నూనెలు తక్కువగా వాడాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూంటే బీపీని నియంత్రించవచ్చన్నారు. అనంతరం సూపర్‌వైజర్లు, ఎంఎ ల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది శిలువ జ్యోతి, ప్రకాష్ పాల్గొన్నారు.

వైసీపీ అల్లరి మూకల హల్‌చల్

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న లింగం బాలక్రిష్ణయ్య

కోడుమూరు, మే 17: పట్టణంలో కొంత మంది టీడీపీ నాయకుల ఇళ్ల దగ్గర గురువారం రాత్రి వైసీపీ మూకలు హల్‌చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల పోలింగ్ సమయంలో వైసీపీ, టీడీపీ నాయకులు మధ్య కొంత వాదోపవాదాలు జరిగాయి. ఇది మనస్సులో పెట్టుకొన్న కొంత మంది వైసీపీ మూకలు తప్పతాగి టీడీపీ నాయకులను బెదిరించారు. ఇందులో భాగంగా టీడీపీ నాయకుడు ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బాలక్రిష్ణయ్య ఇంటి దగ్గరకు వెళ్ళి నానా హంగామా సృష్టించారు. వైసీపీ మూకలు ఇంటి ముందు నిలోచి నానా దుర్భాషలాడుతూ, ఊరి విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే వాహనాలను తగులబెట్టి అంతు చూస్తామని హెచ్చరించినట్లు బాధితుడు తెలిపారు. వైసీపీ మూకల నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అలాగే రాజేశ్వరి అనే మహిళ తన భర్త వెంకటరాముడు మీద, తన మీద వైసీపీకి చెందిన కొంత మంది నాయకులు, కార్యకర్తలు దాడి చేశారని ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు.

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు అవగాహన కల్పించాలి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మే 17: ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణికి నగర పాలక సంస్థలోని అన్ని విభాగాలపై పూర్తిగా అవగాహన కల్పించాలని కమిషనర్ ఎ.భార్గవతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, మెయిన్ సెక్షన్, అకౌంట్స్, మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు శిక్షణ తీసుకోబోతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు సహకరించాలన్నారు. అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, ఎస్ఈ డి.వేణుగోపాల్, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ సం ధ్య, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశేశ్వ రరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు శిక్షణ: ఆల్ ఇండియా సర్వీసెస్ 2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణికి నగర పాలక సంస్థ కార్యాలయంలో వారం రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాయలంలోని ఏడు సెక్షన్‌లకు సంబంధించి శుక్రవారం నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. మెయిన్ సెక్షన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, అకౌంట్స్, టిడ్కో/మెప్మా/యూపీఏ సెక్షన్ల అధికారులతో ఆమె వివిధ విషయాలను అడిగి తెలుసుకుంటారన్నారు.

వృద్ధుల పింఛన్‌ను పునరుద్ధరించాలి

కర్నూలు(న్యూసిటీ), మే 17: తొలగించిన వృద్ధుల పింఛన్‌ను పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వృద్ధుల పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రాన్ని ఫిర్యాదు బాక్సులో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలతో వృద్ధుల పింఛన్‌ను తొలగించడం బాధాకర మన్నారు. కార్యక్రమంలో బోయ నాగన్న, చాంద్ బాషా, శంకరమ్మ పాల్గొన్నారు.

మారిన సిలబస్ ప్రకారం లెసన్ ప్లాన్


మాట్లాడుతున్న డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 17: సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం లెసన్‌ప్లాన్‌ను తయారు చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో శ్యాముల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పెద్దపాడు మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యాసం వత్సరం నుంచి 9, 10 తరగతులకు సీబీఎస్ఈ నుంచి బోధించాల్సి ఉంటుందన్నారు. స్టేట్ సిలబస్ నుంచి 9, 10 తరగతులకు సీబీఎస్ఈ సిలబస్ అనుగుణంగా లెసన్ ప్లాన్ తయారు చేసి విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రెయినర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలంలో ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

ఓర్వకల్లు, మే 17: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వర, చెన్నకేశవస్వామి, ఆంజనేయ, ఈశ్వర, చౌడేశ్వరి అమ్మవారి ఆలయాలకు సంబంధించిన మాన్యానికి శుక్రవారం ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాట పాడేందుకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలం పాటల్లో 106 ఎకరాలకు దేవదాయ భూములకు వేలం పాట వేయగా.. రూ.13,77,500ల ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ.9,52,500 రాగా.. ఈ ఏడాది రూ.4,25,000 ఆదాయం వచ్చిన ట్లు ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు మద్దయ్య, ఆలయ సిబ్బంది చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం


పెంచికలపాడు గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు(ఫైల్)

గూడూరు, మే 17: మండలంలోని పెంచికలపాడు గ్రామ సమీపంలో ఉన్న వక్కిలేరు వాగు బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. వర్షాకాలంలో ఏ చిన్న పాటి వర్షం కురిసిన వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహించి బ్రిడ్జిపైకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వర్షాకాలంలో ప్రతిసారి బ్రిడ్జిపైకి వర్షం నీరు వస్తుండటంతో లోవర్ హెడ్ బ్రిడ్జి(బ్రిడ్జిపై నుంచి వాహనాలు వచ్చేలా)నిర్మాణం చేపడతామని చెబుతు న్నారే తప్ప ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి బ్రిడ్జి నిర్మాణం

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన


స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఆర్ఓ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 17: నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌ను రిటర్నింగ్ అధికారి శుక్రవారం ఎ.భార్గవతేజ పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట సీసీ వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

నేటి నుంచి నరసింహస్వామి ఉత్సవాలు



కోడుమూరు (రూరల్), మే 17: మండలంలోని ముడుమలగుర్తిలో శనివారం నుంచి నవరత్నాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలు జరిపించనున్నట్లు గ్రామప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడిస్తూ, శనివారం ఉత్సవాలకు అంకురార్పణ, గణపతి పూజ, అభిషేకం 19న ప్రభోత్సవం, 20న కలశపూజ, అభిషేకం, శ్రీదేవి ఊరేగింపు, 21న హోమం, స్వామి అమ్మవార్ల కల్యాణం అనంతరం అన్నదానం, సాయంత్రం రథోత్సవం, రాత్రి చిన్నారులకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం 22న నందికోలసేవ, చక్రస్నానంతో వేడుకలు పూర్తవుతున్నట్లు తెలిపారు.

● 22న ఎద్దుల బండలాగుపోటీ: నరసింహస్వామి కల్యాణ వేడుకలను పురస్కరించుకుని 22వ తేదీ 6 పళ్ల పాలబండ ఎద్దుల బండలాగు పోటీ నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి దాతలు చాకలి నాగరాజు, చాకలి సుదర్శన్ రూ. 40 వేలు, రెండో విజేతకు మల్లేష్ రూ. 30 వేలు మూడో విజేతకు శ్రీనివాసరెడ్డి రూ. 15 వేలు నాల్గో విజేతకు సురకత్తుల రాముడు రూ. 10 వేలు బహుమతి అందజేస్తారని వివరించారు.

వాహనం బోల్తా.. డీపీవోకు స్వల్ప గాయాలు



బోల్తా పడిన డీపీవో వాహనం

కోడుమూరు (రూరల్), మే 17: మండలంలోని కొత్తూరు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. డీపీవో ప్రభుత్వ వాహనంలో కర్నూలు నుంచి వస్తుండగా కొత్తూరు వద్ద అదుపు తప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. దీంతో డీపీవోకు గాయాలయ్యాయి. కారు అద్దాలు విరిగిపోయాయి. అటుగా వస్తున్న వాహనదారులు సహాయక చర్యలు చేపట్టి ప్రమాదబారిన పడిన వారిని బయటకు తీశారు. సమాచారం అందుకున్న కోడుమూరు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అక్కడకి చేరుకుని డీపీవోను ప్రత్యేక వాహనంలో కర్నూలు తరలించారు. వాహనంలో డీపీవోతో పాటు డ్రైవర్, అటెండర్, సీసీ ఉన్నట్లు తెలిసింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలుస్తోంది.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం


ఉద్యోగ నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 17: స్థానిక ఉద్యోగ నగర్‌లోని పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవపూజ ధనుంజయ ఆచారి, ఆలయ కమిటీ సభ్యులు రమణాచారి, శ్రీనివాసులు, రామచంద్రయ్య ఆచారి, లింగమ య్య, భక్తులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని పెంచికలపాడు గ్రామంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లిం చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాధికకు డాక్టరేట్



కర్నూలు(అర్బన్), మే 17: నగరానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.రాధిక రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారని వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ వీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సీఎస్ఈ డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ పి.సురేష్‌వర్మ పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సెమన్టిక్ సిమి లారీటి మెజర్స్ ఫర్ రెస్పిరేటరీ సిస్టమ్ డీసీజెస్ అంటాలజీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

జగన్‌కు ఓటమి భయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర

కర్నూలు(అర్బన్), మే 17: జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐ ప్యాక్‌తో ముచ్చట్లు కాదు... రాష్ట్రంలో జరుగుతున్న హింసపై ముఖ్యమంత్రి జగన్ స్పందించి ఉంటే బాగుండేదని అన్నారు. పోలింగ్ తర్వాత రాష్ట్రంలో పలు జిల్లాలో జరుగుతున్న హింసను ఖండించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు.

రగ్బీ క్రీడా వర్క్‌షాపు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), మే 17: స్థానిక ఆదర్శ విద్యామందిరంలో ఏపీ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు టీజీ భరత్ నేతృత్వంలో రగ్బీ క్రీడా వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. జమ్మూకాశ్మీర్ నుంచి అబ్దుల్ వహబ్, ఫిజియోథెరపీలకు ఆటలో గాయాలైన వారికి ఎలాంటి చికిత్స అందించాలో ఆయన వివరించారు. ట్రైనింగ్ ట్రైనర్స్‌కు తమిళనాడు నుంచి ముఖేష్ కుమార్ మెలకువలను వివరించారు. రగ్బీ కోచింగ్‌కు హాజరైన ప్రతినిధులకు చెన్నై నుంచి వచ్చిన నోయల్ మ్యాథ్యూస్ వివరణలు ఇచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాపు ప్రారంభ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అసోసియేసన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్, ప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం హాజరైన 16 మంది సాంకేతిక కార్యక్రమాన్ని జిల్లా క్రీడాభి వృద్ధి అధికారి భూపతి ప్రతినిధులకు స్వాగతం పలికి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రేపు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు, మే 17: మండలంలోని మీదివేముల గ్రామంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా ఈనెల 19న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి రశీదు పొందాలన్నారు. మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదును అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వివరాల కోసం 9703443738, 9701726001 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆదోని

టీడీపీకి సహకరించిన నాయకులకు అభినందనలు

బీవీ జయనాగేశ్వరరెడ్డి



టీడీపీ నాయకులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

నందవరం, మే 17: టీడీపీకి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని నాగలదిన్నె, సోమలగూడురు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో ఆయా గ్రామాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని మాట్లాడారు. మీ గ్రామాల్లోని బూతు వారిగా ఎన్ని ఓట్లు పోలయ్యాయి. ఎంత వరకు మోజార్టీ వస్తుందనే దానిపై నాయకులతో మాట్లాడారు. అందరూ కష్టపడ్డారని, వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పార్థసారధిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్ర, జబ్బార్, ఈరన్న, వహబ్, మునాఫ్, శేషాద్రి తిమ్మప్ప, మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు, మాచాపురం కాశింవలీ పాల్గొన్నారు.

● పోలింగ్ సరళిపై గ్రామస్థాయి నాయకులతో బీవీ సమీక్ష

ఎమ్మిగనూరు రూరల్: రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి అనుకూలంగా ఓటు వేశారని, జూన్4న కూటమి విజయదుందుబి మోగిస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బనవాసి, దైవందిన్నె, మాస్‌మాన్‌దొడ్డి, గుడికల్లు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్థాయి నాయకులతో సమావేశమయ్యారు. పోలింగ్ జరిగిన తీరుపై సమీక్షించారు. అనంతరం ఆయన బీవీ మాట్లాడుతూ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ గెలుపుకోసం ఎంతో శ్రమించారన్నారు. వైసీపీ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని, ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వచ్చేది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనన్నారు. ఎమ్మిగనూరులో కూడా టీడీపీ జెండా రెపరెపలాడుతుందని, తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత టీడీపీ ప్రకటించిన సూపర్-6 పథకాలు అమలు చేస్తామన్నారు.

టీడీపీ కార్యకర్త వీరేష్ మృతి తీరని లోటు

కోసిగి మే 17: కోసిగిలోని 1వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త కురువ వీరేష్ (38) గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటు అని టీడీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. మృతుడికి భార్య రంగమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి మృతిని తట్టుకోలేక ఇంటర్ చదువుతున్న కుమార్తె గోడకు తలకు గుద్దుకుని గాయాలైంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, చింతలగేని నర్సారెడ్డి, అడవి వీరేష్, తాయన్న బుజ్జి, నరసింహులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

దేవనకొండ, మే 17 : అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలను విక్రస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ మోహనవిజయ్‌కూమార్, వ్యవసాయ అధికారి సురేష్ బాబు అన్నారు. శుక్రవారం దేవనకొండలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

మద్దికెర: మండలంలోని ఎరువులు, విత్తనాలు డీలర్లు ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలు మాత్రమే అమ్మాలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీలర్ల సమావేశం జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు లక్ష్మీరెడ్డి, భీమలింగ, నాగభూషణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయం తథ్యం

తుగ్గలి, మే 17: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ పార్టీకే ప్రజలు ఓటు వేశారని, టీడీపీ విజయాన్ని ఆపలేరని టీడీపీ వీరశైవలింగాయత్ రాష్ట్ర నాయకులు కౌశిక్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు చౌదరి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను ప్రజలు భరించలేక పోయారని ఇక వైసీపీ పాలనకు స్వస్తి చెప్పాలని, సైకిల్ గుర్తుకే ఓట్లు వేసి టీడీపీని గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చారని తెలిపారు.

మద్దికెర, మే 17: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు చంద్రశేఖర్‌చౌదరి, వి.రాజేశ్వర్ చౌదరి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేనంత ఉధృతంగా పోలింగ్ జరిగిందని తెలిపారు. పోలింగ్ శాతాన్ని చూస్తోంటే.. ఎన్డీయే కూటమికి 150 సీట్లు పైగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రత్తికొండలో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

తుగ్గలి, మే 17: ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో పనులు చేస్తామని డిమాండ్ ఇచ్చిన ప్రతి ఉపాధి కూలీని పనులు కల్పించాలని, అలాగే పనులకు వెళ్లకుండా మస్టరులో పేర్లు రాసుకున్నా.. పనులు చేయకుండా మస్టర్లు వేసినా చర్యలు తప్పవన్నారు. పాత పనులకు బిల్లులు చేపట్టినా చర్యలు తప్పవన్నారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, మే 17 : వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవ్రేంద‌స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ఆస్పరి, మే 17: కర్నూలు జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్‌లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తుగానే అడ్మిషన్‌లు ప్రారంభించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ముందస్తు అడ్మిషన్‌లు అరికట్టకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యుడు ఈశ్వర్, మండల నాయకులు కార్తీక్, నరసింహులు, రాజు, కృష్ణ పాల్గొన్నారు.


వేరుశనగ విత్తనాలు మంజూరు

వెల్దుర్తి, మే, 17: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వేరుశనగ పంట సాగుకు ప్రభుత్వం నుండి మండలానికి 650 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 20 నుంచి రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. క్వింటా వేరుశనగ పూర్తి ధర రూ.9500లకు గాను 40 శాతం రాయితీ(3800) పోను రైతు రూ.5700 చెల్లించాలన్నారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.2 లక్షలు విరాళం

మంత్రాలయం, మే 17: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి మైసూరుకు చెందిన ఆరూరు మహేష్ అనే భక్తుడు రూ.2లక్షలువిరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానంకు రూ.2 లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

కన్నీటి వ్యథ



కోసిగిలో తాగునీటి ట్యాంకు వద్ద నీరు కోసం పాట్లు పడుతున్న ప్రజలు

● తుంగభద్ర నదితీర గ్రామాల్లో తాగునీటి సమస్య
● గోనెగండ్ల, మద్దికెర, కోసిగిలో అదే పరిస్థితి
● పట్టించుకోని అధికారులు



పెరవలిలో తాగునీటి సమస్య

మద్దికెర, మే 17: మండలంలోని పెరవలి గ్రామం బీసీ కాలనీలో గత నెల రోజుల నుంచి నీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. బీసీ కాలనీలో దాదాపు 500 మంది నివసిస్తున్నారని, బోర్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటి సమస్య తలెత్తిందన్నారు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కోసిగిలోని 9వ వార్డులో తాగునీటి ట్యాంకు వద్ద బారులుగా ఖాళీ బిందెలు



గ్రామాల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. గుక్కెడు మంచి నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న బోరుబావులు ఎండిపోయాయి. దీంతో వ్యవసాయ బావుల వద్ద వెళ్లి తెచ్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. కొంత మంది రైతులు తమ పొలాలు పాడవుతున్నాయని, బోర్ల వద్దకు రావొద్దని చెబుతున్నారని ప్రజలు అంటున్నారు. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోసిగి: పెద్దభోంపల్లి గ్రామంలో



చిన్నభోంపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు ముందు ఖాళీ బిందెలు



మద్దికెర: పెరవల్లిలో నీటి కోసం వేచి ఉన్న మహిళలు

కోసిగి మండలంలో నీటి సమస్య

కోసిగి మే 17: కోసిగి మండలంలో 26 గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటి కోసం గంపెడు కష్టాలు పడుతున్నామని కోసిగి మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన కోసిగిలో 1, 2, 3, 4, 9, 7, 5వ వార్డులలో తాగునీటి సమస్య ఏర్పడింది. మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామాలైన సాతనూరు, తుమ్మిగనూరు, అగసనూరు, కడిదొడ్డి, కందుకూరు, కామన్‌దొడ్డి, అర్లబండ గ్రామాల్లో కూడా నీటి సమస్య తలెత్తింది. వ్యవసాయ బోర్లకు వెళ్లి గ్రామాల ప్రజలు తాగునీరును బండ్ల మీద తెచ్చుకుంటున్నారు. చిన్నభోంపల్లి గ్రామంలో గ్రామం మొత్తం కలిసి ఒక్కటే తాగునీరు బోరు ఉండడంతో ఊరు మొత్తం తాగునీరు కోసం ఆ బోరు వద్దకు గంటల తరబడి పనులు మానుకుని వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెద్దభోంపల్లి గ్రామంలో బోర్లలో నీరు రాక అరకొర తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసినా, అవి కూడా ప్రజలకు అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్య తీర్చాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఐదు రోజులకు ఒక్కసారి నీటి విడుదల

గోనెగండ్ల, మే 17: పెద్దమరివీడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామానికి అలువాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి ఐదు రోజులకు ఒక్కసారి నీరు విడుదల అవుతుంది. దీంతో గ్రామంలోని ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. నీరు విడుదల అయిన రోజు కొళాయిల దగ్గర గంటల తరబడి నీటి కోసం వేచిఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

● అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలకు జరిమానా

ఎమ్మిగనూరు, మే17: ఎమ్మిగనూరు పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాదారులను గుర్తించి జరిమాన విధించడంతో పాటు విత్తన ప్యాకెట్ల అమ్మకాలను నిలుపుదల చేశారు. విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో రూపాస్‌రోనాల్డ్ సిబ్బంది స్థానిక పంచముఖి ట్రేడర్స్, ఆదిత్య ట్రేడర్స్, శివ ట్రేడర్స్ అండ్ సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకన్న రైతులకు అధిక ధరలకు పత్తి విత్తనాలను అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో ట్యాంక్‌బండ్ రోడ్డులో ఉన్న పంచముఖి ట్రేడర్స్, ఆదిత్య ట్రేడర్స్, శివ ట్రేడర్స్ అండ్ సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలను గుర్తించారు. ఇందులో భాగంగా పంచముఖి సీడ్స్, ఆదిత్యట్రేడర్స్, శివ ట్రేడర్స్ సీడ్స్ దుకాణాల్లో రైతులకు అధిక ధరలకు విత్తనాలను అమ్ముతున్న విషయాన్ని గుర్తించారు. మూడు దుకాణాలకు రూ.1.85లక్షల జరిమానా విధించారు. అలాగే యూఎస్ 7061, న్యూజీవీడు, భక్తి రకాలకు చెందిన 315 ప్యాకెట్ల పత్తి విత్తనాలను గుర్తించి వాటి అమ్మకాల నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా విత్తన దుకాణాదారులు రైతులకు అధిక ధరలకు విత్తనాలను అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారాన్ని అందజేయాలన్నారు. అటువంటి దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



తుంగభద్ర నదిలో వరదనీటితో ప్రవాహం

జిల్లాలో భారీ వర్షం

ఆదోని (అగ్రికల్చర్), మే 17: ఆదోనిలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లు, డ్రైనేజీలు జలమయమయ్యాయి. వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 26.4 మి.మీ., మంత్రాలయం 49.6మి..మీ., నందవరం 42.6మి..మీ., కౌతాళం 42.0మి..మీ., హొళగుంద 31.2మి..మీ., గోనెగండ్ల 25.4మి..మీ., ఎమ్మిగనూరు 24.2మి..మీ., కోసిగి 22.8మి..మీ., పెద్దకడబూరు 10.2మి..మీ. వర్షపాతం నమోదయింది. డివిజన్ వ్యాప్తంగా 274.4మి..మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

గోనెగండ్ల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున 25.4 ఎంఎంల వర్షం కురియడంతో రైతులు పొలాలలో పనులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

మంత్రాలయం: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. 40 సెం.మీల వర్షపాతం నమోదు కావడంతో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం మొదలైంది.

నందవరం: మండలంలో గత రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది.

కోసిగి: మండలంలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బంది పడ్డారు.



ఆదోని ఎస్కేడి కాలనీ సచివాలయం ముందు నిలిచిన వాన నీరు



ఆదోని రాజా సాహెబ్ బంగ్లాకు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు



నందవరం: బాపురం కాలనీలో వర్షపు నీరు



హెచ్ కైరవాడి దగ్గర పొలంలో నిలిచిన వర్షపు నీరు





కోసిగి రైల్వేగేటు సమీపంలో నిల్వ ఉన్న నీరు, కోసిగి ప్రధాన రోడ్డుపై ఇల్లా..

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్నూలు అడిషనల్ జిల్లా న్యాయాధికారి



శ్రీమఠం ప్రాంగణంలో ప్రదిక్షణలు చేస్తున్న అడిషనల్ జిల్లా జడ్జి

మంత్రాలయం, మే 17 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూల్ జిల్లా అడిషనల్ న్యాయాధికారి జస్టిస్ భూపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్, మే 17: నియోజకవర్గ వర్గంలో అనుమతి లేకుండా నడుపుతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీయస్యూ తాలూకా కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రైవేటు విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫీజుల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దుర్గప్రసాద్ నాయక్. విక్రమాదిత్య, ఈశ్వర్, అరవింద్ పాల్గొన్నారు.

బియ్యం కోసం సచివాలయం ముట్టడి

● 17 రోజులైనా అందని రేషన్



గజ్జెహళ్లిలో సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న రేషన్ లబ్ధిదారులు

హొళగుంద, మే 17: మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో రేషన్ షాప్ నిర్వాహకులు 17 రోజులైనా రేషన్ బియ్యం సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాన్ని ముట్టడించారు. గ్రామస్థులు చాకలి రామలింగ, శేఖర్ భీమేష్, మంజు, మల్లమ్మ, ఈరమ్మ మాట్లాడుతూ మేము కూలీ పనులు చేసుకుని, రేషన్ బియ్యంతో కడుపు నింపుకుంటున్నామని తెలిపారు. 17 రోజులైనా బియ్యం పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రేషన్ బియ్యం సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఎం ప్రసాద్ రాజుని వివరణ కోరగా, విచారణ చేస్తానని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు

హాలహర్వి, మే 17: గ్రామాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హాలహర్వి పోలీస స్టేషన్ పలువురు నేతలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇరుపార్టీల నేతలు జూన్ 4వ తేదీ వరకు సమన్వయం పాటించాలన్నారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర ఉన్నారు.